ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 20-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలో ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు వచ్చే 5 సంవత్సరాల్లో ప్రభుత్వం 75 వేల మెడికల్ సీట్లను పెంచనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రకటించారు.
- ❖ భారత్ ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ప్రతి పౌరుడు మంచి ఆరోగ్యంతో ఉండాలని కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఉద్ఘాటించారు.
- ❖ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈరోజు వారణాసిలో 6 వేల 700 కోట్ల రూపాయల విలువైన 23 బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.
- ❖ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈరోజు నుంచి సింగపూర్, ఆస్ట్రేలియాల్లో 7 రోజుల పాటు పర్యటిస్తున్నారు.

====================

దేశంలో ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు వచ్చే 5 సంవత్సరాల్లో ప్రభుత్వం 75 వేల మెడికల్ సీట్లను పెంచనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రకటించారు. ఈ రోజు వారణాసిలో ఆర్జే శంకర కంటి ఆసుపత్రిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తమిళనాడులో కంచి కామకోటి పీఠం జగద్గురువు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... కొత్త కంటి ఆసుపత్రి వృద్ధులకు, చిన్నారులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీహార్‌లో మరొక కేంద్రాన్ని ప్రారంభించే అవకాశాలను పరిశీలించాలని శంకర ట్రస్టును కోరారు. దేశంలోనే ప్రధాన ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా ఎదుగుతున్న కాశీ ఖ్యాతిని వివరించారు. గత పదేళ్లలో దేశ ఆరోగ్య సంరక్షణ రంగంలో సాధించిన గణనీయమైన మార్పులను నరేంద్రమోడీ తెలియజేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

====================

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈరోజు నుంచి సింగపూర్, ఆస్ట్రేలియా దేశాల్లో 7 రోజుల పాటు పర్యటిస్తున్నారు. కేంద్రమత్రి రేపు సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్, ఉప ప్రధాన మంత్రి గాన్ కిమ్ యోంగ్ లను కలవనున్నారు. అనంతరం మూడు రోజుల ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఈ నెల 23న మెల్‌బోర్న్‌లో విద్యాశాఖ మంత్రి జాసన్ క్లేర్ ఎంపీని కలవనున్నారు. ఆస్ట్రేలియన్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్‌లో ప్లీనరీ ప్రసంగం కూడా చేస్తారు. అక్టోబరు 24న సిడ్నీలోని ఆబర్న్ లాంగ్ డే చైల్డ్ కేర్ సెంటర్‌ను సందర్శిస్తారు. 25న గ్రాన్‌విల్లే సౌత్ క్రియేటివ్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ హైస్కూల్‌ను, మాక్వారీ పార్క్ ఇన్నోవేషన్ డిస్ట్రిక్ట్ సైట్‌ను సందర్శించనున్నారు.

====================

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈరోజు తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో 6 వేల 700 కోట్ల రూపాయల విలువైన 23 బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కనెక్టివిటీని పెంపొందిచాడానికి లాల్ బహదూర్ శాస్త్రి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లో రన్‌వే విస్తరణ, కొత్త టెర్మినల్ భవనం నిర్మాణానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. ఖేలో ఇండియా, స్మార్ట్ సిటీ మిషన్ కింద 210 కోట్ల రూపాయలకు పైగా విలువైన వారణాసి స్పోర్ట్స్ కాంప్లెక్స్ 2, 3 దశల పునరాభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ స్పోర్ట్స్ స్టేడియంలో 100 పడకల బాలికల, బాలుర హాస్టళ్లను, పబ్లిక్ పెవిలియన్‌ను కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ తదితరులు పాల్గొన్నారు.

====================

దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో గాలి నాణ్యత పేలవమైన విభాగంలోనే కొనసాగుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం ఢిల్లీ వాయు నాణ్యత సూచిక ఈ రోజు ఉదయం 10 గంటలకు 265 వద్ద నమోదైంది. అదే విధంగా ఈ ప్రాంతంలో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. వ్యర్థాలను కాల్చడం వలన వచ్చే అదనపు ఉద్గారాలు గాలి నాణ్యతను గణనీయంగా క్షీణింపజేస్తున్నాయని భారత వాతావరణ విభాగం అభిప్రాయ పడింది.

====================

దీపావళి, ఛట్ పూజ పండుగల సందర్భంగా ఉత్తర, తూర్పు రాష్ట్రాలకు ప్రయాణించే ప్రయాణికుల రద్దీని తట్టుకోవడానికి ముంబై, పూణే, నాగ్‌పూర్‌తో సహా మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుండి మొత్తం 570 ప్రత్యేక సర్వీసులను సెంట్రల్ రైల్వే ప్రకటించింది. ఈ రైళ్లలో AC స్పెషల్స్, AC స్లీపర్, జనరల్ కోచ్‌లతో కూడిన రైళ్లు, అన్‌రిజర్వ్‌డ్ ప్రత్యేక రైళ్లు కూడా ఉన్నాయి. ఇదిలా ఉండగా దక్షిణం వైపు వెళ్లే ప్రయాణికుల కోసం కరీంనగర్, కొచ్చువేలి, కాజీపేట, బెంగళూరు ఇతర గమ్యస్థానాలకు సెంట్రల్ రైల్వే 84 రైళ్లను నడుపుతోంది.

విరామం

====================

భారత్ ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు, దేశంలోని ప్రతి పౌరుడు మంచి ఆరోగ్యంతో ఉండాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయా ఉద్ఘాటించారు. ఈ రోజు తిరువనంతపురంలోని కౌడియార్‌లో జరిగిన అప్‌గ్రేడ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా గోల్ఫ్ కోర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు. 2047 లక్ష్యాలను సాధించడానికి భారతీయ సమాజానికి శారీరక, మానసిక, సాంస్కృతిక ఆరోగ్యం ఎంతో అవసరమని అన్నారు. గోల్ఫ్‌లో భారత్ కు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్రీడా రంగంలో ప్రపంచంలోని అత్యుత్తమ పనితీరు కనబరిచే ఉత్తమ దేశాలలో భారతదేశాన్ని చేర్చడానికి కేంద్ర ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందని మంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 26 సెకన్లు)

=====================

రాజస్థాన్‌లోని ధోల్‌పూర్‌లోని జాతీయ రహదారిపై ఈ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మంది మరణించారు. స్లీపర్ బస్సు, ఆటో రిక్షా ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు ఉన్నారు. బాధితులందరూ వివాహ వేడుక నుండి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాదంలో మరణించిన వారి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి మృతుల కుటుంబానికి 2 లక్షల రూపాయలు, క్షతగాత్రులకు 50 వేల రూపాయలను ప్రకటించారు.

=====================

ఇండోనేషియా నూతన అధ్యక్షుడిగా ప్రబోవో సుబియాంటో ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఇండోనేషియా ప్రపంచంలోని మూడవ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం.  ప్రబోవో అధికారికంగా ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ముస్లిం మెజారిటీ దేశానికి ఎనిమిదో అధ్యక్షుడయ్యారు. 73 ఏళ్ల ప్రబోవో ప్రత్యేక దళాల మాజీ కమాండర్ కూడా పాఠశాల పిల్లలకు ఉచిత భోజనం వంటి విధానాలు ఆయన గెలుపుకు కారణమయ్యాయని భావిస్తున్నారు.

=====================

5వ జాతీయ నీటి అవార్డులు 2023ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 22వ తేదీన న్యూఢిల్లీలో ప్రదానం చేయనున్నారు. ఉత్తమ రాష్ట్రం, ఉత్తమ జిల్లా, ఉత్తమ గ్రామ పంచాయతీ, ఉత్తమ పట్టణ స్థానిక సంస్థ, ఉత్తమ నీటి వినియోగదారుల సంఘం, ఉత్తమ పౌర సమాజం సహా 9 విభాగాల్లో 38 మంది అవార్డులను కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. బెస్ట్ స్టేట్ కేటగిరీలో ఒడిశాకు మొదటి బహుమతి లభించింది. ఉత్తరప్రదేశ్ 2వ స్థానం, ఉత్తరప్రదేశ్, గుజరాత్, పుదుచ్చేరి సంయుక్తంగా 3వ స్థానంలో నిలిచాయి. అవార్డు గ్రహీతకు ట్రోఫీతో పాటు కొన్ని విభాగాలలో నగదు బహుమతులు అందజేస్తారు.

=====================

థాయ్‌లాండ్‌లో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న AFC అండర్-17 ఆసియా కప్ 2025 క్వాలిఫయర్స్ కోసం 23 మంది సభ్యులతో కూడిన జట్టును భారత అండర్-17 పురుషుల జాతీయ జట్టు ప్రధాన కోచ్ ఇష్ఫాక్ అహ్మద్ ఈ రోజు ప్రకటించారు.  గ్రూప్ Dలో ఉన్న భారత్ జట్టు అక్టోబర్ 23న బ్రూనై దారుస్సలామ్‌తో, అక్టోబర్ 25న తుర్క్‌మెనిస్తాన్‌తో, అక్టోబర్ 27న థాయ్‌లాండ్‌తో తలపడుతుంది.

=====================

దుబాయ్‌ల్ జరుగుతున్న మహిళల టీ-20 ప్రపంచ క్రికెట్ కప్ లో భాగంగా దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ప్రారంభిమైంది. తొలిత టాస్ గెలిచిన ఆఫ్రికా జట్టు బౌలింగ్ ఎంచుకుంది. కడపటి వార్తలు అందే సమయానికి న్యూజిలాండ్ మహిళల జట్టు 12 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసింది.

=====================
=====================